క్లుప్తంగా

నరసాపురం రూరల్ ఎస్సైగా ఆంజనేయులు



కె.విశ్వనాథ్‌బాబు

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ ఎస్సైగా కె.విశ్వనాథ్ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో వీరవాసరం ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై నరసాపురం రూరల్ స్టేషన్‌కు ఎస్సైగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు, సిబ్బంది సహకారంతో శాంతి భద్రతలను పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సీతారామ కల్యాణ మహోత్సవాల ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. బుధవారం విశ్వక్సేన పూజతో ప్రారంభమైన ఈ కల్యాణ ఉత్సవాలు సోమవారం వరకూ ఆరు రోజులు పాటు నిర్వహించనున్నారు. శనివారం రథసప్తమి రోజున సాయంత్రం 6.39 గంటలకు నిత్యహోమం, బలిహారణ రాత్రి 7.29 గంటలకు శ్రీ సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రమణ గురుస్వామి తెలిపారు. ఈ ఆరు రోజులు సాయంత్రం 7 గంటలకు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామికి సామూహిక సహస్రనామార్చనలు జరుగుతాయన్నారు. ఆలయ అర్చకులు రఘు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భారతీయ సంప్రదాయాలు పాటించాలి

మొగల్తూరు: ప్రతి ఒక్కరూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని తాడేపల్లిగూడేనికి చెందిన పడాల అవధూత ఆశ్రమ స్వామిజీ కాలభైరవ ఉపాసకులు, శ్రీబోధానంద స్వామిజీ కోరారు. బుధవారం మండలంలోని పేరుపాలెం సౌత్, నార్త్,ముత్యాలపల్లి గ్రామాల్లోని మత్స్యకార ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సంస్కార కేంద్రాల్లోని చిన్నారులతో ముచ్చటిస్తూ సంస్కృతి, సంప్రదాయల గురించి వివరించారు.

మొగల్తూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: మొగల్తూరు-2లోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం 2 పరిధిలోని పడమటిపాలెం, నక్కావారిపాలెం, గొల్లగూడెం, తదితర ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవడమే కాక ఆరోగ్య కేంద్రంలో సుమారు 86 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, సావిత్రి, కె.శ్రీనివాస్, ప్రభాకర్, రమాదేవి పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల అందజేత



గుంపర్రు హైస్కూల్‌కు కంప్యూటర్లు బహూకరిస్తున్న బెజవాడ తులసీరావు

యలమంచిలి: విద్యతో మాత్రమే సమాజ అభివృద్ధి సాధ్యమని మండలంలోని లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బెజవాడ తులసీరావు అన్నారు. గుంపర్రు హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఆయన ఎనిమిది కంప్యూటర్లు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంద ఉమ విద్యార్థులు తులసీరావును శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చేగొండి కల్యాణ్, వలవల యజ్ఞప్రసాద్, బి.హైమ, టి.హనుమకుమారి, ఎం.వెంకటలక్ష్మి, యు.మనోహరం, ఎస్ఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు.

కొడమంచిలి అభివృద్ధి పనులకు శ్రీకారం

పెనుగొండ: కొడమంచిలి అభివృద్ధి పనులకు మాజీ మంత్రిచెరుకువా డ శ్రీరంగనాథరాజు సహకారంతో శ్రీకారం చుట్టినట్లు గ్రామ సర్పంచ్, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తెలిపారు. బుధవారం పంచాయతీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో తెలిపిన సమస్యల పరిష్కారానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పాలకోడేరు: ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన సంఘటన ఇది. అమలాపురం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు సైకిల్‌పై వెళ్తున్న నందం అప్పారావు (తాపీ మేస్త్రీ)ను ఈ నెల 18న శృంగవృక్షం హైస్కూల్ వద్ద ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయమైంది. అప్పటి నుంచి భీమవరం ప్రైవేటు ఆస్పత్రిలో కోమాలో ఉన్నాడు. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. మృతుడి కుమారుడు సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



నరసాపురంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ



మేడపాడులో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ



మొగల్తూరులో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు



కొడమంచిలిలో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న చాంబర్ అధ్యక్షుడు సీతారామ్

నరసాపురం రూరల్: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని నరసాపురం నరసాపురం సబ్ కలెక్టర్ మల్లవరపు సూర్యతేజ సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నరసాపురం మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు ప్రాముఖ్యతను గుర్తించి అర్హులంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. సీనియర్ ఓటర్లకు, వికలాంగ ఓటర్లకు శాలువా కప్పి సత్కరించారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించారు. తొలుత సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పట్టనంలోని ప్రధాన రహదారి గుండా గాంధీచౌక్ వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనతరం కళాశాల విద్యార్థులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు సబ్ కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నాగదేవి అధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో డీఎస్పీ చారి, తహసీల్దార్ ఫాజిల్, ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మేడపాడు గ్రామ సచివాలయం వద్ద సీనియర్ ఓటర్లను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా ఓటుతో ఏం మారదని ఎవరూ అనుకోవద్దని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, వీఆర్వో తోట శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పులపర్తి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: సమర్థులైన, నిస్పక్షపాతంగా వ్యవహరించే నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రతీ ఒక్కరి చేతుల్లోనూ ఎన్నికలనే ఆయుధం ఉందని ఆఓటును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి అనిత కుమారి పిలుపునిచ్చారు.13వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుదవారం స్దానిక పెన్మత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఆర్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును కలిగిఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రదమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి కృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎలక్షన్ డి టి సుగుణ సంధ్య పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీదేవి, జ్యోత్స్నరాణి, మహాలక్ష్మి, నోబుల్ రాజు పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: జాతీయ ఓటరు దినోత్సవం ఆచంట మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం, ఆయా పంచాయతీలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద సీనియర్ సిటిజన్లను సత్కరించి ఓటు హక్కు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్,ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ పాల్గొన్నారు.

పెనుగొండ మండలంలో

పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీన్ ఆధ్వర్యంలో బాలికలు భారీ ర్యాలీ నిర్వహించి ఓటు విశిష్టతపై అవగాహన కల్పించారు. సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిద్ధాంతం, ఇలపర్రు, వడలిల్లోనూ ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు జి.గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

మోసగించిన వ్యక్తికి ఏడాది జైలు

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన ఆర్ఎల్ రాజ్ తిమోతినాయుడుకి ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ పాలకొల్లు 1వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.భానుసాయి బుధవారం తీర్పు చెప్పారు. తిమోతినాయుడు పెట్రోల్ బంక్ పెడుతున్నానని పాలకొల్లుకి చెందిన త్సవటపల్లి రాజశేఖర్‌ను నమ్మించి రూ.5 లక్షలు అప్పు తీసుకుని మోసం చేశారు. 2016లో రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై బోనం ఆదిప్రసాద్ కేసు నమోదు చేశారు. ఏపీపీ మాదాసు జయసింధు ప్రాసిక్యూషన్ నిర్వహించారని ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు.

రూ.7 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



చినమామిడి పల్లిలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సమృద్ధిగా మంచినీరు, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని పీచుపాలెంలో 7 లక్షల లీటర్ల సామర్థ్యం, రూ.2.40కోట్ల వ్యయంతో, చినమామిడిపల్లిలో 8లక్షల లీటర్ల సామర్థ్యం, రూ2.60 కోట్లతో నిర్మించనున్న మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. అదే విధంగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రూ2.60 కోట్ల వ్యయంతో మంగళగుంటపాలెం జగనన్న కాలనీలో చేపట్టనున్న 33-11 కేవీ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రసాదరాజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వేరు వేరు ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే ప్రసాదరాజు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కనీస వేతనాల కమిటీ రాష్ట్ర చైర్మన్ బర్రి లీల, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కామన నాగిని తదితరులు పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలనే లక్ష్యం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పోడూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: రాష్ట్రంలో అవినీతికి తావులేని పరిపాలన అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ పీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు గ్రామంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గడిచిన 3 ఏళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో? ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జగనన్న కాలనీలో ఇళ్లస్థలాలు పొందిన లబ్ధిదారులు వేగవంతంగా పక్కా ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపీటీసీ సభ్యుడు పోడూరి నాగరాజారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, మాజీ వైస్ చైర్మన్ చేకూరి సూరిబాబు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, గ్రామకమిటీ అధ్యక్షుడు పాలా ఏడుకొండలు, ఏఎంసీ డైరెక్టర్ గంటా గిరిబాబు, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



పార్వతీనగర్‌లో లబ్ధిదారుడికి నవరత్నాల బ్రోచర్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు సంక్షేమ పథకాలను అందించి సంక్షేమ సూరీడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు పంచాయతీ పరిధిలోని పార్వతీనగర్, ఆదిత్య కాలనీ, చల్లావానిచెరువులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నవరత్నాల పథకాలను వివరించారు. రూ.1.50 కోట్లతో పార్వతీనగర్‌లో సీసీ రోడ్లు వేయడంతో జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్‌ను స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరడంతో రూ.2 కోట్లకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శి పద్మాజీరావును ఆదేశించారు. అలాగే రూ.7లక్షలతో నిర్మించనున్న ఆదిత్య కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీచైర్మన్ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఆదిత్య కాలనీలో పెదగోపురం ట్రస్ట్‌బోర్డు మెంబర్ ఈరంకి కాశీ ఆధ్వర్యంలో 20 మంది పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు, కాయగూరలు జడ్పీచైర్మన్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం మైఖేల్‌రాజు, సచివాలయ పట్టణ కన్వీనర్ ఎంఎస్ వాసు, ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎస్‌వీ రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ పెదపాటి హవీలా, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సతీష్, గ్రామ పార్టీ నాయకులు కాటంరెడ్డి రామారావు, మిడతాని సీతామహాలక్ష్మి, అల్లు శ్రీను, యాండ్ర ప్రసాద్, కవురు రాంపండు, పోలాపు వెంకన్న, యలకల రామకృష్ణ, బొంతు వెంకయ్య, శిరింగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన వార్షికోత్సవాలు



వాసవీ శాంతి థాంలో సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న దృశ్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి థాంలోని 90 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహ నాలుగో ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామిజీ పర్యవేక్షణలో ట్రస్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు, ఉమా దంపతులు ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్టాపన హోమాలు, నిత్యా పూజా కార్యక్రమాలు, రుద్ర హోమం, మృత్యుంజయ హోమం, జ్యోతిర్లింగాలకు ధాన్యాధివాసం, పుష్పాదివాసం, శయనాధివాసాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు తనికెళ్ల భరణి శివస్తోత్రంలు, ప్రవచనాలు

ప్రతిష్ఠాపన మహోత్సవాలు సందర్భంగా గురువారం వాసవీ శాంతి థాంలో ప్రఖ్యాత శివభక్తులు, సినీ నటుడు తనికెళ్ల భరణి శివస్తోత్రాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పనున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సినీ నటుడు సాయికుమార్ పాల్గొంటారు. అనంతరం శ్రీశైల క్షేత్ర ఉత్సవ విగ్రహాలు శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్ కుమార్

మొగల్తూరు: సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై చేపట్టిన సర్వే పారదర్శకంగా ఉండాలని ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద కుమార్ సూచించారు. ఎస్‌డీజీ(సస్టేయన్‌బుల్ డెవలప్‌మెంట్ గోల్) సుస్థిర, అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులు ఎనిమిది అంశాలపై సర్వే చేయించాలని సూచించారని కార్యదర్శులు, వలంటీర్లు, సంక్షేమ శాఖ సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సర్వేలో పాల్గొనాలన్నారు. రక్తహీనత కలిగి ఉన్న 19 సంవత్సారాల వయస్సు ఉన్న కౌమార దశలో ఉన్న స్త్రీల వివరాలు, రక్తహీనత కలిగి ఉన్న గర్భిణుల వివరాలు, 5 సంవత్సరాలలోపు కుంగిపోయిన పిల్లల వివరాలు, ప్రాథమిక విద్యలో 1 నుంచి ఎనిమిదో తరగతి వరుకు ఉన్న విద్యార్థుల వివరాలు, ఉన్నత విద్యలో ఇంటర్ విద్యార్థుల వివరాలు, మౌలిక సదుపాయాలు కలిగి ఉన్న ప్రాథమిక పాఠశాలల వివరాలు, పాఠశాలలో పని చేస్తున్న టాయిలెట్‌ల వివరాలు తదితర విషయాలపై ప్రతి ఇంటికి వెళ్ళి సర్వే చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నవీన కిరణ్ పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ డిప్యూటీ గవర్నరుగా కనక రత్నమాల



వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నరుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కనకరత్నమాల

పెనుగొండ: భీమలాపురం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు, శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లు ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్‌గా నియమించినట్లు గవర్నర్ ఎస్.కృష్ణమూర్తి ప్రకటించారు. బుధవారం ఈ మేరకు నియమక పత్రం అందించి ప్రమాణస్వీకారం చేయించినట్లు కనకరత్నమాల తెలిపారు. డిప్యూటీ గవర్నరుగా నియమితులైన కనకరత్నమాలను ప్రెసిడెంట్ ఎస్ఆర్ రవీంద్రబాబు, మాజీ శాసన సభ్యురాలు బంగారు ఉషారాణి, అంబికా కృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

పెంపుడు జంతువులకు టీకాలు



పాలకొల్లులో కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ రామశేఖర్

పాలకొల్లు సెంట్రల్: జంతు సంక్షేమం ఓ సామాజిక బాధ్యతని వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు ఎం. రామశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్య శాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా కుక్కలకు ర్యాబిస్ టీకాలను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జంతువులపట్ల దయ, ప్రేమ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పక్షోత్సవాల్లో భాగంగా 25 కుక్కలకు రెబిస్ టీకాను ఉచితంగా వేశారు. ఈ నెల 31 వరకూ జంతు సంక్షేమ పక్షోత్సవాలు జరగనున్నాయి.

యలమంచిలిలో..

యలమంచిలి: జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు అన్ని పశువుల ఆసుపత్రుల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాకులు డాక్టర్ మేడా రామ శేఖర్ చెప్పారు. యలమంచిలి పశు వైద్యశాలలో బుధవారం ఆయన వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు ర్యాబిస్ రాకుండా టీకాలు వేశారు.

నేడు పోడూరులో గడపగడపకు మన ప్రభుత్వం

పోడూరు: మండలంలోని పోడూరు గ్రామంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి వెలువడిన ఒక ప్రకటన వెలువడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికీ పర్యటిస్తారని వివరించారు.

సమన్వయంతో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి



ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నాలను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ, వార్డు ఇన్‌చార్జ్‌లు, మండల కన్వీనర్లంతా సమన్వయంతో పనిచేసి పాలకొల్లులో వైఎస్సార్ సీపీని గెలిపించాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సచివాలయ కన్వీనర్ల సమావేశంలో పట్టణ, మండల కన్వీనర్లుగా నియమితులైన ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నంలను శ్రీనివాస్ శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు జిత్తుల మారి నక్కని, మంచి పథకాలను కూడా చెడు పథకాలుగా చిత్రీకరించి దుష్ప్రచారం చేయగల సమర్థుడని, అతని అరాచకాలను తిప్పికొట్టాలని సచివాలయ కన్వీనర్లను శ్రీనివాస్ కోరారు. పట్టణ సచివాలయ కన్వీనర్ ఎంఎస్ వాసు ఆధ్వర్యంలో పార్టీ విజయానికి రూపొందించిన వీడియో, ఆడియో ప్రదర్శించి ఉత్తేజపరిచారు. జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు, పట్టణ, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం.మైఖేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.